సాక్షి
జనగామ

బుధవారం । 14 । ఆగస్టు । 2024



ఎస్పీడీసీఎల్‌లో పదోన్నతి ప్రక్రియ

టీజీ ఎస్పీడీసీఎల్‌లో పదోన్నతులు కల్పించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు అకౌంట్, ఆపరేషన్ విభాగంలో సీనియారిటీ జాబితాను యాజమాన్యం విడుదల చేసింది. - 8లో▸



అయ్యో అన్నదాతలు!

సొసైటీ అధికారుల నిర్లక్ష్యంతో రుణమాఫీ వర్తించని రైతులు మంగళవారం వరంగల్ జిల్లా ఊకల్ సొసైటీ ఎదుట నిరసన తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$34^0/22^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ, ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు బీర్ల ఐలయ్య



జనగామ: జనగామ జిల్లా కేంద్రంలో ధర్మకంచ మినీ స్టేడియంలో ఈ నెల 15న జరగనున్న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించి కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఉదయం 9 గంటలకు మినీ స్టేడియంలో జాతీయ జెండా ఎగుర వేసిన అనంతరం, పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తారు.

రైతులకు అందుబాటులో ఎరువులు



కొడకండ్ల: రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల షాపులను డీఏఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎరువుల విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎరువులను తప్పనిసరిగా ఈపాస్ మిషన్ ద్వారానే విక్రయించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి విజయ్‌రెడ్డి ఉన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీరాం



నర్మెట: నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని మచ్చుపహాడ్‌కు చెందిన అరిగెల శ్రీరాం ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం పలువురు నాయకులు శ్రీరాంను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిమ్మకంటి యాదగిరి, గణేష్, బాలయ్య, బుగులయ్య, రఘుపతి, అంజయ్య, సంపత్, రాములు, బాపిరాజు, అనిల్, నర్సింహులు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై అధికారుల విచారణ



పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం ఓ విద్యార్థినిపై క్యాటరింగ్ వర్కర్ లైంగిక వేధింపులకు పాల్పడటంతో జిల్లా అధికారులు స్పందించారు. మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ అధికారులుగా డీఆర్‌డీఓ వసంత, జీసీడీఓ గౌసియా బేగం, జిల్లా బాలిక స్త్రీ శిశు సంక్షేమ అధికారి జయంతి, తహసీల్దార్ పి. శ్రీనివాస్‌ను నియమించారు. వీరు మంగళవారం ప్రిన్సిపాల్ స్వరూప, హౌస్ మాస్టర్ సునీత నుంచి సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన విద్యార్థినితో పాటు సహచర విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వివరాలను కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని విచారణ అధికారులు తెలిపారు. వారి వెంట ఆర్‌ఐ రాకేశ్, తదితరులు ఉన్నారు. కాగా లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

యువకుడి ప్రాణం కాపాడిన పోలీసులు

రఘునాథపల్లి: భార్యతో గొడవపడి ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్లిన ఓ యువకుడిని పోలీసులు రక్షించారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని నిడిగొండకు చెందిన తూడి సతీశ్ (25) అనే యువకుడు మంగళవారం భార్యతో గొడవ జరగడంతో ఆత్మహత్య చేసుకుంటానని రైలు పట్టాల వద్దకు వెళ్లాడు. అక్కడ డయల్ 100కు కాల్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటానని సమాచారం అందించారు. వెంటనే పెట్రో కారు కానిస్టేబుల్ యుగేందర్, డ్రైవర్ సురేశ్‌లు అప్రమత్తమై గ్రామ శివారులో రైలు పట్టాల వద్ద ఆత్మహత్య చేసుకునేందుకు రైలు కోసం సతీశ్ ఎదురుచూస్తుండగా పోలీసులు గమనించి అడ్డుకున్నారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మెనూ పాటించరు.. వార్డెన్ ఉండరు

అటెండెన్స్ రిజిస్టర్‌లో తప్పుడు హాజరు

- పత్తాలేని హెల్త్ ప్రొఫైల్ కార్డులు
- కంపుకొడుతున్న టాయిలెట్లు
- జనగామ ప్రీ, పోస్టుమెట్రిక్ ఎస్సీ బాలికల వసతి గృహంలో ఏసీబీ అధికారుల దాడులు
- సాక్షి కథనాలతో కదిలిన ప్రభుత్వం



వివరాలు తెలుసుకుంటున్న ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, అధికారులు

జనగామ: మెనూ పాటించడం లేదు.. వార్డెన్ పర్యవేక్షణ లేదు.. సరుకుల్లో నాణ్యత డొల్ల.. అడ్రస్ లేని బాలికల హెల్త్ ప్రొఫైల్.. హాజరు శాతంలో అవకతవకలు ఇవీ జనగామ జిల్లా కేంద్రం ధర్మకంచలోని ప్రీ, పోస్టు మెట్రిక్ ఎస్సీ బాలికల వసతి గృహంలో ఏసీబీ అధికారుల దాడుల్లో వెలుగు చూశాయి. గత నెల 8వ తేదీన 'సాక్షి'లో వసతి..అధోగతి–సమస్యల వలయంలో సంక్షేమ హాస్టళ్లు అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను తెలుసుకునేందుకు ఫుడ్ సేఫ్టీ, ఆడిట్, తూనికలు కొలతల శాఖలను భాగస్వామ్యులను చేస్తూ.. ఆకస్మిక తనిఖీలు చేయాలని ప్రభుత్వం ఏసీబీ అధికారులకు బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లా ఏసీబీ డీఎస్పీ సాంబయ్య నేతృత్వంలో ఎస్సీ బాలికల వసతి గృహంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.

పోషకాలు లేని భోజనం..

సంక్షేమ వసతి గృహాలు.. వార్డెన్లు, కాంట్రాక్టర్లకు కల్పతరువుగా మారిపోతున్నాయి. సరుకుల నాణ్యతను గాలికి వదిలేస్తున్న పర్యవేక్షకులు.. లాభాపేక్షకు కక్కుర్తి పడుతూ.. విద్యార్థులకు పోషకాలు లేని భోజనం వడ్డిస్తున్నారు. రాత్రి సమయంలో వంట మనుషులు, వాచ్‌మెన్‌లకు వసతి గృహం అప్పగిస్తూ.. ఇంటికే పరిమితమై పోతున్నారు. ఈ నేపథ్యంలో గత నెల సాక్షిలో ప్రచురితమైన కథనాలపై ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. నెల రోజుల పాటు దీనిపై అధ్యయనం చేసి.. హాస్టళ్లను గాడిలో పడేసి, పారదర్శకంగా సేవలు అందించాలనే సంకల్పంతో తనిఖీల బాధ్యతను ఏసీబీకి అప్పగించింది.



సరుకులను కొలత వేస్తున్న ఏసీబీ అధికారులు

నిబంధనలు పాటించడం లేదు

జనగామ ధర్మకంచ బాలికల ప్రీ, పోస్టు మెట్రిక్ ఎస్సీ వసతి గృహంలో ఏ ఒక్క నిబంధన పాటించడం లేదు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీ, ఆడిట్, తూనికల కొలతల ఆఫీసర్లు రోహిత్, నాగరాజు, ప్రవీణ్ కుమార్, ఏసీబీ సీఐలు సట్ల రాజు, ఎల్. రాజు ఆధ్వర్యంలో మూడు గంటల పాటు తనిఖీలు చేశారు. అటెండెన్స్ రిజిస్టర్‌లో 110 మంది విద్యార్థినులు ఉన్నట్లు చూపించగా, ఈ నెల 12వ తేదీన 73 మంది... ఫిజికల్‌గా 60 మంది మాత్రమే ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. హాస్టల్ పరిసరాలు, సరుకుల్లో నాణ్యతా ప్రమాణాలు, టాయిలెట్లు, మరుగుదొడ్ల నిర్వహణలో వార్డెన్ పర్యవేక్షణ లేకపోవడంతో కంపుకొడుతున్న విషయాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించడం లేదని డీఎస్పీ తెలిపారు. విద్యార్థినులకు సంబంధించి రెగ్యులర్ హెల్త్ చెకప్ ప్రొఫైల్ కార్డుల మెయింటనెన్స్ చేయడం లేదని గుర్తించారు. ఏసీబీ అధికారులు దాడులు చేసే సమయంలో వార్డెన్ కవిత విధుల్లో లేకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా ఫుడ్ సేఫ్టీ అధికారులు సరుకుల నాణ్యతకు సంబంధించి శాంపిళ్లను సేకరించగా, కాంట్రాక్టర్ సప్లయ్ చేసిన వాటిలో కొలతల్లో తేడాను సంబంధిత అధికారులు గంటన్నర పాటు తనిఖీలు చేశారు. అధికారుల దాడుల్లో అక్రమాలు, అవకతవకలపై నివేదికను ప్రభుత్వానికి పంపడం జరుగుతుందని డీఎస్పీ సాంబయ్య తెలిపారు. కాగా పేద విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సక్రమంగా అందించే విధంగా ప్రభుత్వం ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో సైతం ఏసీబీ అధికారులచే దాడులు కొనసాగించే విధంగా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.



వసతి..అధోగతి

సాక్షిలో ప్రచురితమైన కథనం

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మైనార్టీ జూనియర్ కళాశాలతో పాటు పాఠశాల, ఎంజేపీ పాఠశాలను కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని విద్యార్థుల గదులు, వంటశాలను పరిశీలించి, నాణ్యతా ప్రమాణాల విషయంలో తేడా రావొద్దని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గురుకులాల్లో పరిశుభ్రత పాటిస్తూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి బి.రవీందర్, ప్రిన్సిపాల్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

ప్రభుత్వ బడులకు వచ్చే విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో మంగళవారం విద్యాశాఖలో అమలు చేస్తున్న కార్యక్రమాలపై డీఈఓ రామ్‌తో కలిసి మండల నోడల్ ఆఫీసర్లు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాల్స్, జిల్లా సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లతో సమీక్షించారు. కాంప్లెక్స్ ప్రాధానోపాధ్యాయులు తమ పరిధిలోని పాఠశాలలను పర్యవేక్షించే సమయంలో విద్యార్థుల నమోదు, మధ్యాహ్న భోజన పథక అమలు తీరు, మొదటి నిర్మాణాత్మక మూల్యాంకనం ఫలితాలకు సంబంధించి పరిశీలన చేయాలన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయుడి బోధన తీరు, విద్యార్థుల భాగస్వామ్యం, బోధన అభ్యసన ప్రక్రియలో ఇందుకు సంబంధించిన ఉపకరణాల ఉపయోగం వినియోగిస్తున్నారా లేదా అని చూడాలన్నారు. పీఎం శ్రీ పథకంలో ఎంపికైన పాఠశాలల్లో పనుల పురోగతిపై ఆయా కళాశాల ప్రిన్సిపాళ్లను అడిగి తెలుసుకున్నారు. కాగా ఉపాధ్యాయులు అనధికారిక సెలవుల్లో ఉంటే తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

బంద్ విజయవంతం

జనగామ: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం తలపెట్టిన జనగామ పట్టణ బంద్ విజయవంతంగా ముగిసింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, భజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షుడు మంగ శంకర్, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యదర్శి మేక బాలసిద్ధయ్య, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, హిందూ వాహిని, బీజేపీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపు నివ్వగా, వ్యాపార, వాణిజ్య సంస్థల యజమాన్యాలు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించారు. హిందూ సంఘాల ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తూ బంగ్లాదేశ్‌లో జరిగే ఘటనలపై నిరసన వ్యక్తం చేశారు. ఏసీపీ పార్థసారధి ఆధ్వర్యంలో సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సైలు, పోలీసు సిబ్బంది ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు చేపట్టారు.



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

తిరిగి వరంగల్‌లోనే ఇంటర్ విద్య ఆర్‌జేడీ కార్యాలయం

- ఇంటర్ విద్య డైరెక్టర్ శృతిఓజా ఉత్తర్వులు జారీ

విద్యారణ్యపురి: గతేడాది హైదరాబాద్‌కు తరలించిన ఇంటర్ విద్య ఆర్‌జేడీ కార్యాలయం తిరిగి వరంగల్(హనుమకొండ)లోనే ఏర్పాటవుతోంది. ఈ మేరకు ఇంటర్ విద్య డైరెక్టర్ శృతిఓజా మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. హైదరాబాద్ నుంచి కార్యాలయాన్ని వెంటనే తరలించాలని పేర్కొన్నారు. కార్యాలయాన్ని హనుమకొండలోని ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల భవనంలో ఏర్పాటు చేయనున్నారు. ఆర్‌జేడీ జయప్రదబాయి ఆన్‌డ్యూటీపై హైదరాబాద్‌లో కమిషనర్ కార్యాలయంలో విధులను నిర్వర్తిస్తున్నారు. ఇప్పటి వరకు అక్కడినుంచే వరంగల్ ఆర్‌జేడీ పాలన కొనసాగించారు. గతేడాది కార్యాలయాన్ని తరలించిన సమయంలో ఫైళ్లను కూడా తీసుకెళ్లారు. 14మంది నాన్ టీచింగ్ ఉద్యోగులు, సిబ్బందిని వివిధ చోట్లకు పోస్టింగ్‌లు ఇచ్చారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ యాదగిరి కమిషనర్ కార్యాలయంలోనే ఆన్‌డ్యూటీపై కొనసాగుతున్నారు. తాజాగా జయప్రదబాయి, యాదగిరి ఆన్‌డ్యూటీలను కూడా రద్దు చేసి వరంగల్‌లో విధులు నిర్వర్తించాలని ఉత్తర్వులు ఇచ్చారు. అదే విధంగా 14మంది సిబ్బందికి కూడా రీ పోస్టింగ్ ఇవ్వనున్నారు. గతంలోని 5వ జోన్, 6వ జోన్‌లతో (ప్రస్తుతం మల్టీజోన్–1, మల్టీజోన్–2) ఎలాగైతే కార్యాలయం ఉండేదో అలాగే పునరుద్ధరిస్తున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అ రెండు జోన్ల పరిధిలోని జిల్లాలకు సంబంధించి 407 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. కాగా, మల్టీజోన్ –1 పరిధిలోకి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. మల్టీజోన్ –2పరిధిలో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. పాత హైదరాబాద్ జోన్ ఒక్కటి మినహాయించి గతంలో ఐదవ, ఆరవ జోన్(ప్రస్తుతం మల్టీజోన్–1, మల్టీజోన్–2)లో ఉన్న జిల్లాలన్నీ వరంగల్ ఆర్‌జేడీ పరిధిలోకే వస్తాయి.




ఆర్‌జేడీ కార్యాలయం ఏర్పాటు చేయనున్న హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల

ప్రజల అభిప్రాయం మేరకే నిర్ణయం

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- 'కుడా' అంశంపై అన్ని వర్గాల ప్రజలతో సమీక్ష

జనగామ: జనగామ ప్రాంతాన్ని కుడా (కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)లో కలిపే నిర్ణయంపై జనగామ పట్టణం, మండలంలోని మెజార్టీ ప్రజల అభిప్రాయం మేరకే ముందుకు వెళ్తామని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లా నైసర్గిక స్వరూపం, అభివృద్ధి, గ్రోత్ కారిడార్, కుడాలో విలీనం తదితర వాటికి సంబంధించి మంగళవారం ఎమ్మెల్యే పల్లా అధ్యక్షతన సిద్దిపేట రోడ్డులోని గీతాంజలి స్కూల్‌లో ప్రముఖులు, రాజకీయ పార్టీలు, చాంబర్ ఆఫ్ కామర్స్, డాక్టర్లు, న్యాయవాదులు, జేఏసీ, పౌర సమాజం, మేధావులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుడాలో విలీనంపై మిశ్రమ స్పందన వచ్చిందన్నారు. ఎక్కువ మంది జుడా (జనగామ అర్బన్ డెవలప్‌మెంట్) ఉంటే బాగుంటుందని తమ అభిప్రాయాలను చెప్పారన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ పోకల జమున, బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్రగుప్త, ప్రముఖులు ప్రసాదరావు, డాక్టర్ బీఎల్‌కే రెడ్డి, పోకల లింగయ్య, డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్, కన్నా పర్శరాములు, చంద్రరుషి, సాధిక్ అలీ, ప్రభాకర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈ విషయమై సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, ఇర్రి అహల్య, నాయకులు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో సమీక్ష నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

జనగామ: పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆధ్వర్యంలో ధర్మకంచ మినీ స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న ఆటల పోటీలు హోరా హోరీగా సాగుతున్నాయి. మంగళవారం పోలీసు, మండల పరిషత్, రెవెన్యూ డివిజనల్ (ఆర్డీఓ), ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు సంబంధించి క్రికెట్ పోటీలో 18 టీంలు తలపడ్డాయి. మొదటి రోజు లీగ్ మ్యాచ్‌లో పోలీసుశాఖ వర్సెస్ పాలకుర్తి ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు తలపడగా పోలీసులు విజయం సాధించారు. నేడు (బుధవారం) ఏడు టీంల మధ్య క్వార్టర్, సెమీ, ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించి జిల్లా యువజన క్రీడల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పంద్రాగస్టు వేడుకలకు ఏర్పాట్లు

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యేలు, ప్రముఖులు హాజరు కానున్న నేపథ్యంలో డీసీపీ రాజమహేంద్రంనాయక్ ఆదేశాల మేరకు డాగ్‌స్క్వాడ్‌బృందం మైదానంలో మెటల్ డిటెక్టర్‌తో తనిఖీలు చేశారు. మున్సిపల్ శానిటేషన కార్మికుల ఆధ్వర్యంలో పిచ్చి మొక్కలు తొలగించి గ్రౌండ్‌ను చదును చేస్తున్నారు.

ఈసారి.. ఎవరికో..?



మళ్లీ తెరపైకి 'నామినేటెడ్' పోస్టుల భర్తీ అంశం

- ఎన్నికలు, అసెంబ్లీ సమావేశాలతో ఆలస్యం
- ముఖ్యమంత్రి అమెరికా నుంచి రాగానే కసరత్తు
- పదవుల పందేరంపై కాంగ్రెస్‌లో జోరుగా చర్చ
- ఆశలపల్లకిలో ఆశావహ నేతలు.. హైదరాబాద్‌కు చక్కర్లు
- ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్ మంత్రి ప్రతిపాదనలే కీలకం?

సాక్షిప్రతినిధి, వరంగల్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్లు, ముఖ్యనేతల దృష్టి మళ్లీ నామినేటెడ్ పదవులవైపు మళ్లింది. పదేళ్ల తర్వాత ప్రభుత్వం ఏర్పాటు పార్టీ నేతల్లో జోష్ నింపగా.. పదవులు ఆశించే వారిసంఖ్య కూడా పెరిగింది. అధికారంలోకి రాగానే లోక్‌సభ, ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 39 కార్పొరేషన్ల భర్తీతోనే 'నామినేటెడ్'ల ప్రక్రియ నిలిచిపోయింది. మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీ తదితర అంశాలపై ఏఐసీసీ నేతలతో చర్చించిన సీఎం రేవంత్‌రెడ్డి.. అసెంబ్లీ సమావేశాలు ముగియగానే అమెరికా పర్యటనకు వెళ్లడంతో ఆ ప్రస్తావన లేకుండా పోయింది. సీఎం విదేశీ పర్యటన ముగించుకుని బుధవారం హైదరాబాద్‌కు రావడమే తడవు.. నామినేటెడ్ పదవుల భర్తీ జరుగుతుందన్న సంకేతాలు ఎమ్మెల్యేలు, జిల్లా ఇన్‌చార్జ్‌లకు అందాయి. దీంతో ఎమ్మెల్యేలు సైతం రెండు రోజులుగా ఆశావహుల జాబితాను షార్ట్‌లిస్టు చేసే పనిలో పడ్డారని పార్టీ నేతల్లో చర్చ జరుగుతోంది. ఈసారి నామినేటెడ్ పోస్టుల్లో ఉమ్మడి వరంగల్ నుంచి ఎవరెవరికీ స్థానం దక్కనుందని కేడర్ చర్చించుకుంటోంది.

నేతలకు 'ప్రోటోకాల్'సమస్య.. తప్పనిసరిగా మారిన పదవులు..

అసెంబ్లీ ఎన్నికల్లో 12 నియోజకవర్గాలకు 10 చోట్ల కాంగ్రెస్ గెలుపొందింది. స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి గెలుపొందిన కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలో చేరగా, అక్కడ ఓటమి చెందిన సింగపురం ఇందిర అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రొటోకాల్ సమస్య ఎదురవుతోంది. అదేవిధంగా పాలకుర్తి అభ్యర్థిగా అనూహ్యంగా తప్పుకున్న హనుమాండ్ల ఝూన్సీరెడ్డి.. తన కోడలు యశస్విని రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించారు. ఝూన్సీరెడ్డి, జనగామ నుంచి ఓటమి చెందిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిలకు ఇదే సమస్య ఉంది. మొదటినుంచి పార్టీని అంటిపెట్టుకున్న వరంగల్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ కూడా పదవి ఆశిస్తున్నారు. వర్ధన్నపేట టికెట్ ఆశించిన నమిండ్ల శ్రీనివాస్, సీనియర్ నేతలు కూచన రవళిరెడ్డి, బండి సుధాకర్ గౌడ్, డా.లక్ష్మీనారాయణ నాయక్, భట్టి శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్‌రావు, డా.పెరుమాండ్ల రామకృష్ణ, బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, ములుగు డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, బానోతు రవిచందర్ తదితరులు ప్రొటోకాల్ కోసం పదవులు ఆశిస్తున్నారు. కాగా, నామినేటెడ్ పదవులకు సిఫారసు చేయడంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలే కీలకమయ్యారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ద్వారా జాబితా పంపేందుకు సిద్ధమవుతుండగా.. ఆశావహులు కూడా ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పెట్టుబడులే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం అమెరికా, దక్షిణ కొరియాల పర్యటనకు వెళ్లడంతో పదవులు ఆశిస్తున్న నేతలు శ్రావణ మాసం ముహూర్తంగా వేచి చూస్తున్నారు. 13 రోజుల పాటు విదేశాల్లో పర్యటించిన సీఎం.. పంద్రాగస్టు తర్వాత పాలనాపరమైన అంశాలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టనున్న నేపథ్యంలో పదవులు ఆశిస్తున్న వారు లాబీయింగ్ చేసేందుకు హైదరాబాద్ బాట పడుతున్నారు.

ఈసారి మరెందరికో..

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాష్ట్ర, జిల్లా స్థాయి నామినేటెడ్ పోస్టులపై ఉమ్మడి వరంగల్ నుంచి చాలామంది నేతలు ఆశలు పెట్టుకున్నారు. మొదటి విడతగా రాష్ట్ర వ్యాప్తంగా 39 మందికి మార్చిలోనే కార్పొరేషన్ పదవులు ప్రకటించినా.. ఎన్నికల్ కోడ్ కారణంగా జూలై 8న అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఉమ్మడి వరంగల్ నుంచి జంగా రాఘవరెడ్డి (రాష్ట్ర కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ ఫెడరేషన్ చైర్మన్), ఇనగాల వెంకట్రామిరెడ్డి (కుడా చైర్మన్), బెల్లయ్య నాయక్ (ఎస్టీ కార్పొరేషన్), ఎండీ రియాజ్ (గ్రంథాలయ పరిషత్), అయిత ప్రకాష్ రెడ్డి (వాణిజ్య ప్రోత్సాహక కార్పొరేషన్)లకు అవకాశం దక్కింది. అంతకుముందు ఈ జిల్లానుంచే మాజీ ఎంపీ, సీనియర్ నేత సిరిసిల్ల రాజయ్య ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లా నుంచి 12 మందికి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ స్థాయి పదవులు దక్కగా.. 'కుడా'చైర్మన్ మినహాయిస్తే ఇప్పటివరకు ఐదుగురినే కార్పొరేషన్ పదవులు వరించాయి. మరో ఐదారుగురు సీనియర్లకు అవకాశం కల్పించే చాన్స్ ఉండగా.. మలి విడతలో ఉమ్మడి వరంగల్ నుంచి ఎవరెవరిని పార్టీ అధిష్టానం ఎంపిక చేస్తుందో త్వరలోనే తేలనుంది.

కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమ పాలన



మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ రూరల్: కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన జరుగుతుందని డీసీసీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలోనే ప్రజా సంక్షేమపాలన అందుతుందని, పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం పని చేస్తున్నారన్నారు. ఎన్నికల హామీలో భాగంగా రూ. 2 లక్షల రైతు రుణ మాఫీ దేశ చరిత్రలో నిలుస్తుందన్నారు. జనగామ సుందరీకరణకు ప్రణాళికలు రూపొందించి సీఎందృష్టికి తీసుకెళ్లామన్నారు. జనగామ ప్రజలకు తాగు నీరు అందించడానికి చీటకోడూర్ రిజర్వాయర్ శుద్ధి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. నాయకులు బడికే ఇందిర, నర్సింగరావు, శివరాజ్ పాల్గొన్నారు.

ఆరోపణలు తప్ప ఆధారాలు లేవు

- మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

జనగామ: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో రూ.లక్ష కోట్లు తిన్నారని అసంబద్ధమైన ఆరోపణలు చేయడం తప్ప.. కాంగ్రెస్ నేతల వద్ద ఎటువంటి ఆధారాలూ లేవని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య అన్నారు. జనగామ జిల్లా ఉద్యమ కేసుకు సంబంధించి పొన్నాల మంగళవారం కోర్టుకు హాజరైన అనంతరం విలేకరులతో మాట్లాడారు. రూ.లక్ష కోట్ల ఆరోపణలపై కమిషన్ ముందు ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు చేస్తున్న కాంగ్రెస్ నాటకాలను ఎవరూ నమ్మే స్థితిలో లేరన్నారు. తెలంగాణ రైతులు వానాకాలంలో సాగు చేసిన పంటకు నీరందక ఎండిపోతుంటే ప్రభుత్వం కళ్లప్పగించి చూస్తోందన్నారు. దేవాదుల ప్రాజెక్టుకు నీరు రాకుండా, ఏపీ ముఖ్యంత్రి చంద్రబాబు దోచుకుని పోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవాదుల ద్వారా రిజర్వాయర్లకు నీటిని మళ్లించడంలో ఏ ఒక్క మంత్రికి అవగాహన లేదన్నారు. మేడిగడ్డ మూడు పిల్లర్లు కుంగిపోతే హంగామా చేస్తున్నారని, వ్యవస్థలో లోపాలు ఉండడం పరిపాటే అన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గోదావరి జలాలు సముద్రంలో కలిసిపోతుంటే ఈ ప్రభుత్వం కళ్లప్పగించి చూస్తుందే తప్ప, ప్రాజెక్టులకు మళ్లించడం లేదన్నారు. జిల్లాలోని రిజర్వాయర్లలో నీరు లేక, చెరువులు ఇంకి వానాకాలంలో సాగు చేసిన పంటలన్నీ ఎండుతున్నాయన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, నాయకులు ధర్మపురి శ్రీనివాస్, ఉల్లెంగుల సందీప్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న పొన్నాల లక్ష్మయ్య, పక్కన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

క్లుప్తంగా

గ్రామాల్లో రెవెన్యూ అసిస్టెంట్ ఉండాలి

హన్మకొండ : ప్రతి గ్రామంలో రెవెన్యూ అధికారితో పాటు రెవెన్యూ అసిస్టెంట్ ఉండేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి, ప్రధాన కార్యదర్శి పట్టల విజయ్ బాబు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారి ఉండేలా ప్రతిపాదనలు పంపాలని కమిటీకి సూచించిన నేపథ్యంలో తమ అసోసియేషన్ ప్రతి గ్రామానికి రెవెన్యూ అసిస్టెంట్‌ను నియమించాలన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులను అప్పటి ప్రభుత్వం 2020లో వివిధ ప్రభుత్వ శాఖల్లో విలీనం చేసిందని, వారిని తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకుని గ్రామ రెవెన్యూ అధికారులుగా నియమించాలన్నారు.

భార్యను చంపిన భర్త

- కుషాయగూడెంలో ఘటన
- భర్తకు మతిస్థిమితం లేకే చంపాడంటున్న స్థానికులు



నూర్‌బీ మృతదేహం

మామునూరు : మతిస్థిమితం కోల్పోయిన ఓ వ్యక్తి నిద్రిస్తున్న తన భార్యను టవల్‌తో ఉరేసి చంపాడు. ఈఘటన మామునూరు పోలీస్‌స్టేషన్ పరిధి వర్ధన్నపేట మండలం కుషాయగూడెంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ హైదర్, నూర్‌బీ(45) దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల కుమారుడి బిడ్డ అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి హైదర్ మతిస్థిమితం కోల్పోయి తరుచూ భార్యతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న భార్య నూర్‌బీ మెడ చుట్టూ టవల్ చుట్టి చంపాడు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో ఎస్సై శ్రీకాంత్ హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు ఎస్‌కే సలీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు.

భర్త వేధింపులు భరించలేక..

- వివాహిత ఆత్మహత్య
- అప్పయ్యపల్లెలో ఘటన

గణపురం: వివాహేతర సంబంధం నెరుపుతున్న భర్త వేధింపులు భరించలేక మనస్తాపం చెందిన ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన గణపురం మండలం అప్పయ్యపల్లెలో జరిగింది. ఎస్సై అశోక్ కథనం ప్రకారం .. గణపురం మండలం ధర్మరావుపేటకు చెందిన గంపల పద్మ, కోటి దంపతుల చిన్న కుమార్తె వెన్నెల (21), అప్పయ్యపల్లెకి చెందిన నోముల రాకేశ్ రెండున్నర సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఏడాదిన్నర వయసు గల కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో రాకేశ్ వివాహేతర సంబంధం నెరుపుతూ 'నువు నాకు నచ్చడం లేదు' అని సంవత్సర కాలంగా వెన్నెలను వేధింపులకు గురి చేస్తున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన వెన్నెల సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. తహసీల్దార్ మురళీధర్ రావు ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై అశోక్ పేర్కొన్నారు.



ఎన్పీడీసీఎల్‌లో పదోన్నతి ప్రక్రియ

జేఎల్‌ఎం నుంచి ఏఎల్‌ఎం పదోన్నతికి మెరిట్ కమ్ సీనియార్టీ

- ఆపై పోస్టు నుంచి చీఫ్ ఇంజనీర్ వరకు రిజర్వేషన్ కమ్ సీనియార్టీ
- మెరిట్ కమ్ సీనియార్టీపై ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ల గుస్సా



హన్మకొండ : టీజీ ఎన్పీడీసీఎల్ విద్యుత్ శాఖలో పదోన్నతుల ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ముందు పదోన్నతులు కల్పించి, ఆ తర్వాతే బదిలీలు చేపడితే ఖాళీలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని భావించింది. ఈ మేరకు పదోన్నతుల ప్రక్రియను మొదలు పెట్టింది. సోమవారం రాత్రి ఇంజనీర్లు, పర్సనల్ విభాగం, అకౌంట్ విభాగంలో సీనియార్టీ జాబితాను యాజమాన్యం విడుదల చేసింది. మంగళవారం ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ విభాగంలోనూ సీనియార్టీ జాబితాను విడుదల చేశారు. ఆపరేషన్ విభాగంలో జూనియర్ లైన్‌మన్ నుంచి అసిస్టెంట్ లైన్‌మన్ పోస్టుల పదోన్నతిలో మెరిట్ కమ్ సీనియారిటీని అమలు చేయాలని, ఆపై పోస్టు నుంచి చీఫ్ ఇంజనీర్ వరకు రిజర్వేషన్ కమ్ సీనియారిటీ పద్ధతిలో పదోన్నతులు కల్పించనున్నారు. కోర్టు ఉత్తర్వులు, ప్రభుత్వం జారీ చేసే నిబంధనల మేరకు తదుపరి చర్యలుంటాయని షరతు విధిస్తూ పదోన్నతులు కల్పించాలని యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. జూనియర్ లైన్‌మన్ నుంచి అసిస్టెంట్ లైన్‌మన్ పదోన్నతులు మెరిట్ కమ్ సీనియార్టీ ప్రాతిపదికన చేస్తామనే అంశంపై ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్లు గుస్సాగా ఉన్నాయి. ఇక్కడ కూడా రిజర్వేషన్ రోస్టర్ కమ్ సీనియార్టీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నాయి. మరో వైపు బీసీ, ఓసీ వెల్ఫేర్ అసోసియేషన్లు రిజర్వేషన్ కమ్ రోస్టర్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాయి. చాలా రోజులుగా పదోన్నతులు లేక రిటైర్డ్ అవుతు అధికారులు, ఉద్యోగుల ఇబ్బందులు చూసి పదోన్నతులు కల్పించాలని యాజమాన్యం భావించింది. పదోన్నతి ఆశావహులను దృష్టిలో ఉంచుకుని సంఘాలు, అసోసియేషన్లు బాధ్యతగా వ్యవహరించాలని యాజమాన్యం సూచిస్తోంది. మరో రెండు రోజుల్లో ఈ ప్రక్రియ ముగియనుంది. నేడో, రేపు విభాగాల వారీగా పదోన్నతుల ఉత్తర్వులు వెలువడే అవకాశముంది. ఆ తర్వాత బదిలీల ప్రక్రియను చేపట్టేందుకు యాజమాన్యం సిద్ధంగా ఉంది. పర్సనల్ ఆఫీసర్ల సీనియార్టీలో పదోన్నతుల జాబితాలో ఆరుగురు, జూనియర్ పర్సనల్ ఆఫీసర్ల సీనియార్టీలో ఏడుగురు ఉన్నారు. అకౌంట్స్ జనరల్ మేనేజర్ క్యాడర్‌లో ఆర్.చరణ్‌దాస్ ఒక్కరే ఉన్నారు. సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ జాబితాలో బి.వెంకట కృష్ణ, అకౌంట్స్ ఆఫీసర్స్ సీనియార్టీలో ఐదుగురు, ఏఏఓ సీనియార్టీల్లో 14 మంది, సూపరింటెండెంట్ ఇంజనీర్ల జాబితాలో ఇద్దరు, డీఈల జాబితాలో నలుగురు, ఏడీఈల సీనియార్టీ జాబితాలో 22 మంది ఉన్నారు.

ఇక్కడ మూత్రం పోయొద్దన్నందుకు..

- క్యాబ్ డ్రైవర్ రాజుపై యువకుల దాడి
- మద్యం మత్తులో కాజీపేటలో హల్‌చల్



గాయపడిన క్యాబ్ డ్రైవర్ పిండి రాజు

కాజీపేట: 'ఇది క్యాబ్‌ల అడ్డా, బస్టాండ్ ప్రాంతం.. ప్రయాణికులు తిరుగుతుంటారు.. మూత్రం పోయొద్దు. దూరంగా వెళ్లి పోయండి.' అని అన్నందుకు ఓ క్యాబ్‌డ్రైవర్‌పై మద్యం మత్తులో ఉన్న యువకులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో కాజీపేటలో జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఓ కారులో వచ్చిన యువకులు కాజీపేట చౌరస్తాలోని బస్టాండ్ ప్రాంతంలోని రహదారిపై మూత్ర విసర్జన చేసేందుకు యత్నించగా అక్కడే ఉన్న క్యాబ్ డ్రైవర్ పిండి రాజు వద్దని వారించాడు. దీంతో ఆగ్రహించిన యువకులు తమ మిత్రులకు ఫోన్ చేయగా మరో రెండు కార్లలో యువకులు ఘటనా స్థలికి చేరుకుని క్యాబ్ డ్రైవర్ పిండి రాజుపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఏం జరుగుతుందో అర్థంగాక నివెరపోయిన రాజు ప్రాణ భయంతో తప్పించుకోవడానికి పక్కనే ఉన్న సులభ్ కాంప్లెక్స్‌లోకి పరుగెత్తినా విడిచి పెట్టకుండా దాడి చేశారు. స్థానికుల సాయంతో రాజు తప్పించుకుని పోలీస్ స్టేషన్‌కు చేరుకోగా యువకులు వెంటపడి మరీ ఇష్టారీతిగా కొట్టడంతో తల పగిలింది. ఈ ఘటనలో ఓ యువకుడు తన తండ్రి సిద్దిపేటలో ఆర్‌ఎస్సై అంటూ పోలీస్ స్టేషన్‌లోనే పోలీసులపై ఇష్టారీతిగా మాట్లాడుతూ జులుం ప్రదర్శించడం కాజీపేట పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. దాడికి పాల్పడిన వ్యక్తుల్లో ఆరుగురు యువకులు, ఒక యువతి ఉన్నట్లు క్యాబ్ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు బాధితుడితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ దాడిలో ఉన్న యువకులు మద్యం మత్తులో ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. బాధితుడు పిండి రాజును వైద్యం కోసం పోలీసులు ఎంజీఎం ఆసుపత్రికి పంపించారు. చేతి కడియంతో పిండి రాజు తలపగులగొట్టిన హర్షిత్‌తోపాటు మరో ఆరుగురిపై సీఐ సుధాకర్ ఆదేశం మేరకు ఎస్సై శివకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ఘటనలో మూడు కార్లు ధ్వంసమైనట్లు పోలీసులు తెలిపారు.

లక్ష్యంపై దృష్టి సారించాలి

- సీబీఐ మాజీ డైరెక్టర్ వి.వి.లక్ష్మీనారాయణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వి.వి.లక్ష్మీనారాయణ

హన్మకొండ : విద్యార్థులు లక్ష్యం వైపు దృష్టి సారించాలని సీబీఐ మాజీ డైరెక్టర్ వి.వి.లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో మోషన్ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని లక్ష్మీనారాయణ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ రెండేళ్లు ఎవరైతే కష్టపడతారో.. వారు విజయం సాధించి ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కాలేజీ డైరెక్టర్లు చిర్ర గణేశ్, శరత్, పెరుమాండ్ల అనిల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

4న బీసీ, ఓసీ ఉద్యోగ జేఏసీ ధర్నా

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల పదోన్నతులు కల్పించడంలో యాజమాన్యాలు అవలంబిస్తున్న తీరును నిరసిస్తూ సెప్టెంబర్ 4న హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధ ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలంగాణ ఎలక్ట్రిసిటీ బీసీ, ఓసీ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకుడు నీలారపు రాజేందర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాత్రి హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డిని కమిటీ ప్రతినిధులు నోటీసు అందించారు.

వరంగల్ నగరంలో సకల వనరులు



మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటనారాయణ

- అతిపెద్ద నగరంగా ఎదిగేందుకు అవకాశం
- బాలవికాస రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

కాజీపేట రూరల్ : వరంగల్ నగరం రాష్ట్రంలోనే కాకుండా దేశంలో అత్యంత ప్రాచీన సంస్కృతీ, శిల్ప కళ, పండితులు, మేధావులకు నిలయమని, ఉత్తర, దక్షిణ దేశ ప్రాంతాలకు ముఖ ద్వారంగా ఉంటున్న వరంగల్ రాష్ట్రంలో అతిపెద్ద మహానగరంగా ఎదగడానికి అన్ని వనరులు ఉన్నాయని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కాజీపేట ఫాతిమానగర్ బాలవికాస సెంటర్‌లో మంగళవారం పింగళి సంపత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన వరంగల్ మహానగర ఏకీకరణ, పునర్నిర్మాణం రౌండ్ టేబుల్ సమావేశంలో జిల్లాలోని పలువురు వక్తలు పాల్గొన్నారు. మాజీ మేయర్ టి.రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ వరంగల్ నగరానికి సుదీర్ఘ చరిత్ర, సంస్కృతి ఉందన్నారు. రాజకీయ చైతన్యం కలిగి ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలు మెండుగా ఉన్న నగరాన్ని పాలనా సౌలభ్యం పేరుతో హనుమకొండ, వరంగల్‌గా రెండు ముక్కలు చేసి అభివృద్ధికి ఆటంకం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, విజయబాబు, ప్రొఫెసర్ విజయలక్ష్మి మాట్లాడుతూ కాజీపేట, హనుమకొండ, వరంగల్ ట్రైసిటీని ఒకే జిల్లాగా మార్చడం ద్వారా వరంగల్ నగరం హైదరాబాద్‌కు కౌంటర్ మ్యాగ్నెట్‌గా ఎదుగుతుందన్నారు. ముత్తిరెడ్డి అమరేందర్‌రెడ్డి, ఎం.డి.గుల్షన్, దారా జనార్దన్, సోమరామ్మూర్తి మాట్లాడుతూ భద్రకాళి, జైలు, ఆర్‌ఈసీ, కాకతీయ యూనివర్సిటీ వరంగల్ నగరానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చాయన్నారు. అలాంటి నగరాన్ని రెండు ముక్కలుగా చేయడం ప్రజలకు ఇష్టం లేదన్నారు. కేవలం రాజకీయ, రియల్ ఎస్టేట్ లక్ష్యాలు మాత్రమే నెరవేరుతాయన్నారు. ముఖ్యమంత్రితో పాటు జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రం అందజేసి వరంగల్ మహానగరాన్ని ఒకే జిల్లాగా చేయడానికి ప్రణాళికలు చేయాలని, గతంలో జరిగిన తప్పులు సవరించుకోవడం, తెలంగాణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని అందరూ సహకరించాలని సభ తీర్మానం చేసింది. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పెద్ది వెంకటనారాయణ గౌడ్, రావుల సదానందం, కర్ర యాదవరెడ్డి, బి.వెంకటేశ్వర్లు, రైల్వే జేఏసీ నాయకులు కొండ్ర నర్సింగరావు, దేవులపల్లి రాఘవేందర్, అల్లం మల్లికార్జునరావు, సాయిని నరేందర్, వడ్నాల నగేష్, జి.సుధాకర్, పి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

గంజాయి విక్రయదారుడి అరెస్ట్

- రూ.4.45 లక్షల విలువైన సరుకు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఇన్‌స్పెక్టర్

మామునూరు : వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై రహస్యంగా ఎండు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి నుంచి రూ.4,45,875 విలువైన 17.875 కిలోల సరుకు స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. మామునూరు పీఎస్ పరిధి వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఎస్సై శ్రీకాంత్ సోమవారం వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఏపీలోని విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం బంకురు వలస గ్రామానికి చెందిన గేదెల శ్రీరాం (29) గంజాయి విక్రయిస్తూ కనిపించాడు. దీంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

రెడ్డిపాలెం జంక్షన్ వద్ద 430 గ్రాములు..

వరంగల్: ఏనుమాముల పీఎస్ పరిధిలోని రెడ్డిపాలెం జంక్షన్ వద్ద మంగళవారం ఎస్సై పి.శ్రీకాంత్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన కారల్‌మార్క్స్‌నగర్‌కు చెందిన పలగల చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 430 గ్రాముల ఎండు గంజాయి లభించింది. దీంతో సరుకు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసు ఇన్‌స్పెక్టర్ పులి రమేశ్ తెలిపారు.

తండ్రిపై కూతురు, అల్లుడు హత్యాయత్నం

- ఆస్తి కోసం ఘాతుకం
- భూపాలపల్లిలో ఘటన

భూపాలపల్లి అర్బన్: ఆస్తి కోసం తండ్రిపై కూతురు, అల్లుడు హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని కారల్‌మార్క్స్ కాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు వేల్పుల మల్లేశ్‌కు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. చిన్న కూతురు, అల్లుడిని ఇల్లరికం తెచ్చుకుని జీవిస్తున్నారు. తండ్రి ఆస్తి తనకే చెందాలంటే తనకే చెందాలని అక్కాచెల్లెల మధ్య కొద్దిరోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఎలాగైనా ఆస్తి దక్కించుకోవాలనే దురాలోచనతో చిన్న కూతురు మహేశ్వరి.. తండ్రిని హత్య చేయడానికి కుట్రపన్నింది. ఇందులో భాగంగా సోమవారం రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న తండ్రి మల్లేశ్‌పై తనతోపాటు భర్త లక్ష్మారెడ్డి, గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. కేకలు వినిపించడంతో స్థానికులు బాధితుడి ఇంటికి చేరుకుని మల్లేశ్‌ను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. తండ్రిపై హత్యాయత్నానికి పాల్పడిన వారిపై పెద్ద కుమార్తె రాజేశ్వరి, అల్లుడు జగన్‌మోహన్ రెడ్డి.. పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసురత్నం

న్యూశాయంపేట : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, జీహెచ్ఎంసీ, జీడబ్ల్యూఎంసీ, కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో వివిధ విభాగాల్లో కార్మికులను వెంటనే పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పరకాల మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య, టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి, సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు, నాయకులు రమేశ్, కుమార్, కవిత, లత, యాదమ్మ, భాగ్యమ్మ, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

గుడుంబాపై ఉక్కుపాదం మోపాలి

- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి

హన్మకొండ అర్బన్ : పల్లెలు, తండాలను పట్టిపీడిస్తున్న గుడుంబాను తుది ముట్టించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ.కమలాసన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో గుడుంబాపై ఉక్కుపాదం మోపడానికి జిల్లా యంత్రాంగం చేసిన కృషి అభినందనీయమన్నారు. ఇలాగే కఠినంగా వ్యవహరిస్తూ ఆగస్టు 31 నాటికి ఉమ్మడి వరంగల్ జిల్లాను గుడుంబారహిత జిల్లాగా మార్చేందుకు పటిష్ట కార్యాచరణ రూపొందించాలన్నారు. ప్రధానంగా గుడుంబా అరికట్టేందుకు తయారీకి వినియోగించే బెల్లం సరఫరాపై నిఘా పెట్టాలని, సరఫరా చేస్తున్న వ్యక్తులపై కూడా కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. గుడుంబాతోపాటు డ్రగ్స్, ఎన్‌డీపీఎస్ కేసులపై దృష్టి పెడుతూ, మరో పక్క పెండింగ్ కేసుల్లో నిందితులకు నోటీసులు ఇచ్చి కోర్టులకు రప్పించాలన్నారు. అనంతరం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ పోలీస్ శాఖ తరఫున ఎక్సైజ్ శాఖకు పూర్తి స్థాయి సహకారం అందిస్తామని, గుడుంబా, గంజాయి, ఇతర డ్రగ్స్‌పై సమిష్టిగా పనిచేస్తామని తెలిపారు. సమావేశంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు, ఐదు జిల్లాల ఎక్సైజ్ సూపరింటెండెంట్‌లు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యో అన్నదాతలు..!

రుణమాఫీ వర్తించని 184 మంది రైతులు

- ఊకల్ సొసైటీ ఉద్యోగుల నిర్వాకం
- ఆధార్ నంబర్లను తప్పుగా నమోదు



సొసైటీ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

గీసుకొండ : మండలంలోని ఊకల్ ఆంధ్రా బ్యాంకు కర్షక సేవా సహకార సంఘానికి (ఊకల్ సొసైటీ) చెందిన పలువురు రైతులు సొసైటీ ఉద్యోగుల నిర్వాకం కారణంగా రుణమాఫీకి నోచుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏకంగా 184 మంది రైతులకు రూ. 2 లక్షల లోపు రుణమాఫీ వర్తించని పరిస్థితి నెలకొంది. తమకు జరిగిన అన్యాయంపై మంగళవారం సొసైటీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. ఊకల్ సొసైటీలో 13 గ్రామాలకు చెందిన సుమారు 3 వేల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. వీరిలో అర్హులకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మూడు విడతల వారీగా రుణమాఫీని ప్రకటించింది. అయితే తమ పేర్లు రుణమాఫీ జాబితాలో రాక పోవడంతో కొంతమంది రైతులు గీసుకొండ ఏఓ వద్దకు వెళ్లి వాకబు చేశారు. తమ వివరాలు రాకపోగా కంప్యూటర్‌లో 'నాట్ ఫౌండ్' అని వస్తుండడంతో ఆందోళన చెందిన రైతులు మధ్యాహ్నం సొసైటీ ఎండీ, సీఈఓలను కలిశారు. సొసైటీ నుంచి పంపించిన రుణమాఫీ జాబితాను చూపించాలని కోరారు. వారు చూపించిన జాబితాలో తమ పేర్లు ఉన్నప్పటికీ ఆధార్ నంబర్లను తప్పుగా నమోదు చేయడంతో రుణ మాఫీ వర్తించలేదని గుర్తించి అధికారుల అలసత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే అధికారులు తమ తప్పిదాలను కప్పి పుచ్చుకోవడానికి చాలా సొసైటీల్లో ఇలాంటి తప్పిదాలు జరిగాయని, ఇది సాధారణ విషయమే అంటూ నిర్లక్ష్యంగా చెబుతున్నారని రైతులు ఆరోపించారు. దీనికి బాధ్యులను చేస్తూ సొసైటీ ఎండీ, సీఈఓను ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేయాలని సొసైటీ రైతు, మచ్చాపూర్ మాజీ సర్పంచ్ బోడకుంట్ల ప్రకాశ్ డిమాండ్ చేశారు. తమకు రుణ మాఫీ వర్తించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కాగా, ఇటీవల వంచనగిరి సొసైటీలో సీఈఓ నిర్లక్ష్యం కారణంగా అర్హులకు రుణమాఫీ వర్తించకపోవడంతో అతడిని డీసీఓ సంజీవ రెడ్డి సస్పెండ్ చేశారు. తాజాగా ఊకల్ సొసైటీ రైతులకు ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా రుణమాఫీ వర్తించని పరిస్థితి నెలకొంది.

టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధికి సహకరిస్తా

- వరంగల్ ఎంపీ కడియం కావ్య



మాట్లాడుతున్న వరంగల్ ఎంపీ కడియం కావ్య, పక్కన ఎమ్మెల్యే నాగరాజు తదితరులు

మడికొండ : కాజీపేట మండలం మడికొండలోని టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధికి తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని వరంగల్ ఎంపీ కడియం కావ్య హామీ ఇచ్చారు. మంగళవారం మడికొండలోని టెక్స్‌టైల్ పార్కులో నిర్వహించిన గ్రీన్ టెక్నాలజీ ఆవిష్కరణ వర్క్ షాప్ కమ్ అడాప్షన్ కార్యక్రమానికి ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు, న్యూఢిల్లీలోని సిడ్బీ అసిస్టెంట్ మేనేజర్ బాజ్‌పాయ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ పవర్ లూమ్ కార్మికులతో చర్చల్లో పాల్గొని కేంద్ర ప్రభుత్వ ప్రయోజనాలు పొందే విధంగా సిఫారసు చేస్తానన్నారు. సిడ్బీ సీఐపీ కింద అందించే కార్యక్రమంలో నేత కార్మికులు పాల్గొని ఉత్తమ పద్ధతులు పాటించాలన్నారు. నేత కార్మికులకు లబ్ధి చేకూరే ఏ పనినైనా ముందుండి చేస్తానన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు మాట్లాడుతూ టెక్స్‌టైల్, నేత కార్మికుల సమస్యలు పూర్తిగా తెలుసుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశం ఏర్పాటు చేసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. సిడ్బీ అసిస్టెంట్ మేనేజర్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ చేనేత రంగానికి వరంగల్ పవర్ లూమ్ క్లస్టర్ ప్రధానమన్నారు. కార్యక్రమంలో కాకతీయ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.శ్రీరామ్, గ్రాంట్ థోర్న్ టన్ భారత్ ఎల్‌ఎల్‌పీ పార్టనర్ ప్రొఫెసర్ వి.పద్మనంద్, అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దర్గాస్వామి, భారత్ ఎల్‌ఎల్‌పీ డైరెక్టర్ జైదీ, క్లస్టర్ మేనేజర్ జింక రామకృష్ణయ్య, డి.నవీన్‌కుమార్, ఎ.జ్యోతి, భాస్కర్, కె. విజయ్‌కుమార్, ప్రభాకర్, సిద్ది రాములు, రాధిక, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతోనే క్రమశిక్షణ

- కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్ : ఎన్‌సీసీతోనే విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి అన్నారు. తెలంగాణ ఎన్‌సీసీ పదో బెటాలియన్ ఆధ్వర్యంలో కేయూలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ ప్రత్యేక శిబిరం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎన్‌సీసీ కెడెట్స్‌చే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ మేరకు మల్లారెడ్డి ఎన్‌సీసీ కెడెట్స్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీ రిపబ్లిక్ పరేడ్‌లో ఓరుగల్లు సత్తా చాటాలని ఆకాంక్షించారు. వరంగ్ గ్రూప్ కమాండర్ పాల్‌స్మిల్ మాట్లాడుతూ..ఎన్‌సీసీ ద్వారా నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. ఏపీ, తెలంగాణ వాయుసేన కెడెట్స్ రాజస్తాన్‌కు బయలుదేరే ముందు మామునూర్‌లో శిక్షణ పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో క్యాంపు కమాండెంట్ రామదురై, కేయూ కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేశ్‌లాల్, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ వై. వెంకయ్య, హాస్టల్ల డైరెక్టర్ ఎల్‌పీ.రాజ్‌కుమార్, కమాండెంట్ కల్నల్ రవిసునారే, కమాండింగ్ ఆఫీసర్ మంజుల, కెప్టెన్ సతీశ్‌కుమార్, ఎం.సదానందం, సుబేదార్ మేజర్ సుహాస్ కదం, లెఫ్టినెంట్ గణేశ్, సందీప్‌రెడ్డి, శాంతి, సారస్య, ఏడుకొండలు, సుజిత తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తి పెంపొందించేందుకు చర్యలు

- విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రావణ్‌కుమార్



మాట్లాడుతున్న విజయ డెయిరీ ఉమ్మడి వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శ్రావణ్‌కుమార్

తొర్రూరు రూరల్: పాల ఉత్పత్తి పెంపొందించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని విజయ డెయిరీ ఉమ్మడి వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శ్రావణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని వెలికట్ట గ్రామ శివారులోని పాల కేంద్రంలో పాల ఉత్పత్తిదారుల అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ డెయిరీకి దీటుగా విజయ డెయిరీ పాడి రైతులను ప్రోత్సహించేందుకు ప్రతి లీటర్ పాలకు ప్రభుత్వం తరఫున అదనంగా రూ.4 చొప్పున అందిస్తున్నామన్నారు. రైతులకు రెండు వారాలకు ఒక్కసారి పాల బిల్లులు అందిస్తూ, ప్రతి పాడి రైతుకు దాణా, మినరల్ మిక్చర్ అందిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాలోని ప్రతి గ్రామంలో పాల సేకరణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాల కేంద్రం చైర్మన్ రాసల సమ్మయ్య, డెయిరీ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, మేనేజర్ హనుమంతు, ఉద్యోగులు సుధాకర్‌రెడ్డి, శ్రీను, వెంకటనారాయణ, రమేశ్, అశోక్, చంద్రమౌళి, రైతులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

ఇల్లు అమ్మబడును

■ HNK పోలీస్ కా.లోని Rd.No.8 వెస్ట్ ఫేస్ 250 గంజల G+1 పర్మిషన్, Gr. ఫ్లోర్ ఓపెన్, ఫస్ట్ ఫ్లోర్ కంప్లీట్ 2BHK & 1BHK సొంతంగా నిర్మించిన ఇల్లు అమ్మబడును. Cont: 8143970871. [WA-7534]

SERVICES

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇప్పించబడును. CIBIL అవసరం లేదు. NPA కుడా దరఖాస్తు, హన్మకొండ. సెల్: 8331878592. [WA-6517]

BUSINESS OFFER

■ మీరు బైబ్యాక్ అగ్రిమెంట్‌తో లాభదాయకమైన లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ వ్యాపారాన్ని ప్రారంభించండి. (ప్రభుత్వ ఆమోదితము) 8376001873, 9643010487, 83760 89771, 011-25920179 [DA-5872]

WANTED

■ కాంట్రాక్టర్ వద్ద రైల్వే & పెట్రోల్‌బంక్ నందు సివిల్ వర్క్స్ చేయుటకు ఇంజనీర్ & సూపర్‌వైజర్ కావలెను. అ: సివిల్ ఇంజనీర్ -B.Tech(Civil), సూపర్‌వైజర్-ITI, Diploma, Degree. Work Place: TG & AP. 9989606333, 9491474143. [W-1239831]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ. అదనపు లైను 60/- రూ. మాత్రమే 5% GST అదనము

■ ప్రముఖ యంగ్ ఇండియా కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul: 10th-డిగ్రీ Sal: 20k-30k మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్‌ఫ్రం హోం అవకాశం 9030612463 [G-8995]

■ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. ఫోన్: 8977639662, 8977639663 [H-796266]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.